

26న సహకార ఉద్యోగుల సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - ఏలూరు

పశ్చిమగోదావరి జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సిఐటియు) ఉమ్మడి జిల్లా మహాసభ ఈ నెల 26న శనివారం తాడేపల్లిగూడెంలో జరుగుతుందని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.బాబూరావు, జిల్లా కన్వీనర్ పివి.నరసింహారాజు తెలిపారు. ఈ మహాసభకు ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.అజయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షులు పివి.సత్యనారాయణరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, రాష్ట్ర కోశాధికారి టి.వెంకటరామయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభలో జిల్లాలో సహకార సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభకు జిల్లాలోని అన్ని సహకార సొసైటీల నుండి కార్యదర్శులు, ఉద్యోగులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.



విద్యుత్ లేక బోసిపోయిన మల్లయ్యగూడెం సచివాలయం

సచివాలయాలకు కరెంటు కట్..!


బిల్లులు చెల్లించకపోవడమే కారణం

సేవలందక జనం అవస్థలు: కలెక్టర్ జోక్యంతో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - చింతలపూడి

సచివాలయం కరెంట్ బిల్లుల బకాయిలు పేరుకుపోవడంతో ఆ శాఖ విద్యుత్ సరఫరా నిలిపివేసింది. దీంతో సచివాలయంలో అన్నిరకాల సేవలు నిలిచిపోవడంతో ఆ సచివాలయ పరిధిలోని జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నా ఉన్నతాధికారులు స్పందించకపోవడం దారుణమని అంతా విమర్శిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలో రాఘవాపురం, మల్లయ్యగూడెం, పోతునూరు సచివాలయాలకు సుమారు పది రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మల్లయ్యగూడెం సచివాలయంలో కంప్యూటర్, ప్రింటర్‌ను పోతునూరు పంచాయతీ వద్దకు తీసుకెళ్లి సిబ్బంది అక్కడ నుంచి పని చేస్తున్నారు. ఈ పరిస్థితి పది రోజుల నుంచి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రతిరోజూ ఏదోక పనిపై సచివాలయానికి వస్తుంటారని, విద్యుత్ సరఫరా లేదని చెప్పడంతో చింతలపూడి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్ శాఖ సిబ్బందిని ప్రశ్నించగా విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోవడంతో అధికారుల ఆదేశాల మేరకు కనెక్షన్ కట్ చేశామన్నారు. ఎంపిడిఒ మణికుమారిని ఈ సమస్యపై ప్రశ్నించగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లానన్నారు. ఆయన విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించారని


నినదిస్తున్న వ్యకాస నేతలు, పేదలు

ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు ఇవ్వాలి

ఎపి వ్యకాస ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం మండలాల్లోని ఎర్రకాలువ ప్రాజెక్టు మిగులు భూముల్లో సాగు చేసుకోవడానికి గిరిజనులు, దళితులు, భూమిలేని పేదలకు సాగు పత్రాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఎర్రకాలువ జలాశయం మిగులు భూములను పేదలకు సాగుకివ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా ఎర్రకాలువ మిగులు భూముల్లో భూస్వాములు అక్రమంగా పామాయిల్, జామాయిల్, కొబ్బరి, కోకో తదితర పంటలు వేసుకుని అక్రమ బోరు, విద్యుత్ కనెక్షన్లతో పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. ఎర్రకాలువ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వానికి ఇచ్చిన భూముల్లోనే భూస్వాములు మళ్లీ పంటలు సాగు చేస్తున్నారన్నారు. అక్రమ బోరు కనెక్షన్లు తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు భూముల్లో అక్రమంగా ఉన్న భూస్వాములను తొలగించి జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం మండలాల్లో గిరిజనులు, దళితులు, భూమిలేని పేదలకు సాగు పత్రాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మానుకొండ జీవరత్నం, జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్, యాగంటి సీతమ్మ, రెండు మండలాల గిరిజనులు, దళితులు, పేదలు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న నేతలు

ఏజెన్సీలో అక్రమ లేఅవుట్లు

చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీలో అక్రమ లేఅవుట్లలో నిర్మాణాలు చట్ట విరుద్ధమని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వ్యవసాయ భూమిని ఇళ్ల స్థలాలు చేసి గిరిజన చట్టాలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి జె.కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఇళ్ల స్థలాలు (లేఅవుట్) ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ మండలంలోని బుట్టాయగూడెం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 605లో 73 సెంట్లు, కట్టెద్ది మురళీకృష్ణకు చెందిన సర్వే నెంబర్ 605/1లో 27 సెంట్లు మొత్తం ఒక ఎకరం భూమిని ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేశారన్నారు. ఈ భూమిని జంగారెడ్డిగూడెంలో అధికార పార్టీకి చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి గిరిజన చట్టాలకు విరుద్ధంగా రూ.32 లక్షలకు కొనుగోలు చేశారని ఆరోపించారు. గిరిజనులను కాపాడాల్సిన మండల ప్రజాప్రతినిధులే ఇళ్ల నిర్మాణానికి మెటీరియల్ కాంట్రాక్టు, వాల్యూయేషన్, ఇళ్ల స్థలాల కోసం సంపాదించారని ఫైళ్లు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ అక్రమ లేఅవుట్ నిర్మాణాలపై తహశీల్దారుకు ఫిర్యాదు చేస్తే తమకు ఎటువంటి అధికారాలు లేవని, అన్నీ సచివాలయ సిబ్బందికి ఉన్నాయని తెలిపారని చెప్పారు. ఎవరికి వారు తమకు అధికారం లేదని తప్పించుకుంటే సమస్యలు ఎప్పటికి పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజన చట్టాల ఆధారంగా అక్రమంగా లేఅవుట్ వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, ఆయనకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇళ్ల నిర్మాణం చేపడితే గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు కె.ఖాన్సర్, కార్యదర్శి పోలోజు నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తామా ముత్యాలమ్మ పాల్గొన్నారు.

నేడు, రేపు సిఐటియు జిల్లా మహాసభ

ఏర్పాట్లన్నీ పూర్తి చేసిన నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా.. కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా నిరంతరం ఉద్యమించే సిఐటియు ఏలూరు జిల్లా 12వ మహాసభ ఈ నెల 19, 20వ తేదీల్లో ఏలూరులో జరగనుంది. ఈ మహాసభ నిర్వహణకు సర్వంసిద్ధమైంది. శనివారం ఉదయం పదిగంటలకు ఆర్ఆర్‌పేటలోని కాశీవిశ్వేశ్వర కల్యాణ మండపంలో ప్రారంభమయ్యే మహాసభకు ముఖ్య అతిథులుగా ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, కె.స్వరూపరాణి, ఆర్‌వి.నరసింహారావుతోపాటు ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు ఆర్‌ఎస్.హరనాధ్, చోడగిరి శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు రమేష్‌కుమార్, ఎల్‌వి.సాగర్ హాజరుకానున్నారు.

2019 డిసెంబరు ఆరు, ఏడు తేదీల్లో తాడేపల్లిగూడెంలో 11వ జిల్లా మహాసభ నిర్వహించారు. ఆ తర్వాత తిరిగి ఈ మహాసభను ఏలూరులో నిర్వహిస్తున్నారు. ఈ మహాసభలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపైనా, వారి హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన ఉద్యమాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నారు. కరోనా మహమ్మారి వచ్చిన తర్వాత కార్మికుల ఆర్థిక పరిస్థితులు అధ్వానంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో తిరిగి కార్మికులు ఆర్థికంగా నిలదొక్కుకునేలా వారికి వేతనాలు పెంచాలనే దానిపై చేపట్టే ఉద్యమాలపైనా చర్చించనున్నారు. వీటితోపాటు మూడేళ్ల కాలంలో కార్మికుల సమస్యలపై చేపట్టిన ఉద్యమాలపైనా, వాటి ఫలితాలపైనా కూడా చర్చించనున్నారు. లాక్‌డౌన్ సమయంలో జిల్లాలో సిఐటియు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా వలస కార్మికులకు ఆహారాన్ని అందించారు. మున్సిపల్, ఇతర కార్మికులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఐసోలేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సుమారు 300 మందిని కరోనా బారి నుంచి కాపాడారు. 2019 నుంచి ఇప్పటి వరకూ దేశవ్యాప్తంగా మూడుసార్లు నిర్వహించిన దేశవ్యాప్త సమ్మెల్లో జిల్లాలోని సిఐటియు నాయకులు తమదైన రీతిలో కీలకభూమిక పోషించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలోనూ జిల్లా నేతలు తమదైన పాత్ర పోషిస్తున్నారు. వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ఉద్యమాల్లో, రైతాంగ, వ్యవసాయ కార్మికుల ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన ఆందోళనల్లో పాల్గొన్నారు.

ఉద్యమాల్లో కొన్ని..

ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం పోరస్ కెమికల్ పరిశ్రమలో ప్రమాదం జరిగి 10 మంది కార్మికులు మరణించారు. ఆ కార్మికులకు ప్రభుత్వం రూ.25 లక్షల నష్టపరిహారం ప్రకటించింది. రూ.కోటి పరిహారం ఇవ్వాలని ఆందోళన చేయగా రూ.50 లక్షలు ప్రకటించారు. లక్కవరం రైతు డెయిరీ పరిశ్రమలో ప్రమాదం జరిగి మహిళా కార్మికురాలు చనిపోయారు. ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రి వద్ద సిఐటియుగా ఆందోళన నిర్వహించి రూ.8 లక్షలు పరిహారం ఇప్పించారు. వర్క్‌మెన్ కాంపెన్సేషన్ కింద ఫిర్యాదు చేసి మరో రూ.7.60 లక్షలు కార్మికురాలి కుటుంబానికి ఇప్పించారు. భీమడోలు ప్రాంతంలోని నాగహనుమాన్ పరిశ్రమ, తిరుమల డెయిరీ, సగ్గొండ ఆంధ్రా షుగర్స్, తాళ్లపూడిలో రైస్‌మిల్లు కార్మికుడు, పోలవరం ప్రాజెక్టు పనుల్లో మరణించిన కార్మికులకు సిఐటియు ఆందోళనల ఫలితంగా నష్టపరిహారం అందింది. రుద్ర టెక్నోఫీడ్ పరిశ్రమలో ప్రమాదం జరిగి కార్మికుడు కాలు కోల్పోతే ఆందోళన చేసి నష్టపరిహారం ఇప్పించేందుకు ప్రయత్నించారు. నూజివీడు శ్రీనివాస ఫీడ్ ప్లాంట్లో ప్రమాదం జరిగి కార్మికుడు చనిపోతే ఆందోళన చేసి రూ.25 లక్షలు నష్టపరిహారం ఇప్పించారు. ద్వారకాతిరుమల దేవస్థానంలో కాంట్రాక్ట్ కార్మికురాలు క్యాన్సర్‌తో అనారోగ్యానికి గురైతే కాంట్రాక్టర్‌తో మాట్లాడి రూ.1.50 లక్షల సాయం అందించారు. ఇలా ఎన్నో విజయాలు సాధించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ మూడేళ్లకాలంలోనే ఎన్నో పోరాటాలు, మరెన్నో విజయాలు సాధించారు. ప్రస్తుతం జిల్లాలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభలో చర్చించనున్నారు. రానున్న మూడేళ్లలో చేపట్టాల్సిన ఉద్యమాల ప్రణాళికకు రూపకల్పన చేయనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.సోమయ్య, డిఎన్‌విడి.ప్రసాద్ తెలిపారు.


మహాసభ ప్రాంగణాన్ని అలంకరిస్తున్న నేతలు, కార్యకర్తలు

కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై చర్చ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ, కొత్తగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై పరిశీలనకు జిల్లాకు విచ్చేసిన కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు ఉదిత ఖండపాల్, శివమ్ ఆరోరా శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ముసాయిదా ప్రచురణ పూర్తయ్యిందని, వాటిపై అభ్యంతరాల స్వీకరణకు డిసెంబర్ ఎనిమిదో తేదీ వరకు గడువు ఇచ్చామని తెలిపారు. అనంతరం ఎన్నికల కమిషన్ సూచనల మేరకు తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ కారణంగా ముంపు ప్రాంతాల్లోని ఏడు పోలింగ్ స్టేషన్ల తొలగింపు, వాటి స్థానంలో కొత్తగా ఎనిమిది పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు అంశంపై ఎన్నికల సంఘం అధికారులు కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పోలవరం బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎవి.సత్యనారాయణమూర్తి, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీరాణి, రాష్ట్ర ఎన్నికల సంఘ కార్యాలయాధికారి ఎస్‌వి.మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎన్నికల కమిషన్ అధికారులు

ప్రొటోకాల్ రగడ

విద్యాశాఖ తీరుపై రచ్చ

వాడీవేడిగా దెందులూరు మండల సమావేశం

ప్రజాశక్తి - దెందులూరు

నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.సుమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో ఏ శాఖ కార్యక్రమాలు చేపట్టినా విధిగా ప్రొటోకాల్ పాటించాలని ముప్పవరం సర్పంచి ఎం.సంతోష్‌కుమార్ అన్నారు. ప్రజలచే ఎన్నికైన తమకు గ్రామంలో కనీసం సమాచారం ఇవ్వడం లేదని, ఓట్లేసి గెలిపించిన ప్రజలకు తాము ఏం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దీనిపై జెడ్‌పిటిసి ఎన్.లీలానవకాంతం స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టినప్పుడు తప్పకుండా ప్రొటోకాల్ పాటించాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో లోపాలను అధిగమించి రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖాధికారులను కోరారు. మండలంలో వైద్య సేవలు సక్రమంగా లేకపోవడంతో వైద్యఆరోగ్య శాఖలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని సమావేశం కోరింది. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకోని వారికి ఒక కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హౌసింగ్ ఎఇ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నాగరాజు, తహశీల్దార్ ఎన్‌వి.నాంచారయ్య, వివిధ శాఖల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

క్రీడాకారిణి మహాశ్రీకి ఘనస్వాగతం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకూ అస్సోం రాష్ట్రం గౌహతిలో నిర్వహించిన జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో అద్భుత ప్రతిభను చాటి కాంస్య పతకం సాధించిన లక్కోజు డింపుల్ మహాశ్రీకి ఏలూరులో శుక్రవారం ఘనస్వాగతం లభించింది. సత్రంపాడు సమీపంలోని నెహ్రూకాలనీ 12వ రోడ్డుకు చెందిన డింపుల్ మహాశ్రీ శిక్షకుడు దేవరపల్లి ప్రసాద్ వద్ద కొంతకాలంగా అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతుంది. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించిన జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఆమె 60 మీటర్ల డాష్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా ఆమె తల్లి ఝాన్సీ మాట్లాడుతూ కేవలం ఈ పతకంతో సరిపెట్టుకోకుండా అంతర్జాతీయస్థాయి పోటీల్లోనూ తమ కుమార్తె రాణించేలా ప్రోత్సహిస్తామని తెలిపారు.


మహాశ్రీకి స్వాగతం పలికిన స్థానికులు

సచివాలయ నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని వెలగపాడు పంచాయతీలో గ్రామ సచివాలయ భవన నిర్మాణంపై నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు జిల్లా పంచాయతీ అధికారి నిమ్మగడ్డ బాలాజీ శుక్రవారం గ్రామసభ నిర్వహించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. మండలంలోని వీరభద్రవరంలో శుక్రవారం సర్పంచి నయనారపు జలపాలు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ముఖ్యఅతిథిగా డిపిఒ విచ్చేశారు. వెలగపాడు పంచాయతీలో నూతన సచివాలయ భవన నిర్మాణ విషయంలో వెలగపాడు, వీరభద్రవరం గ్రామాల ప్రజల మధ్య వివాదం నెలకొంది. తమ గ్రామంలోనే సచివాలయం నిర్మించాలని ఇరు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో కొందరు కోర్టును సైతం ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఈ వివాదం పరిష్కారానికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. వీరభద్రవరంలో సచివాలయం నిర్మించాలని 262 మంది చేతులెత్తి తమ ఆమోదం తెలిపారు. వెలగపాడు గ్రామంలోగాని, వెలగపాడు, వీరభద్రవరం గ్రామాల మధ్యగాని సచివాలయం నిర్మించడానికి ఎవరూ ఆమోదం తెలపలేదు. దీంతో గ్రామ సభ తీర్మానం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు నివేదించి ఆయన ఆదేశాలతో తదుపరి కార్యాచరణ చేపడతామని డిపిఒ బాలాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ ఎస్ఎస్.నగేష్, ఎంపిపి డి.లక్ష్మి, తహశీల్దార్ జెవి.సుబ్బారావు, ఎంపిడిఒ ఎన్.తిరుపతిస్వామి, పిఆర్ ఎఇ సంపతకుమారి, ఎంపిటిసి మామిళ్లపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిపిఒ బాలాజీ

ధాన్యం కొనుగోళ్లలో సొసైటీలే కీలకం

సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నెంబర్ 18004256453

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు



రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలదే కీలకపాత్ర అని, అవి మరింత చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గౌతమి సమావేశపు మందిరంలో శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెజ్జు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎంఎల్‌ఎలు కొఠారు అబ్బయ్యచౌదరి (దెందులూరు), పుప్పాల వాసుబాబు (ఉంగుటూరు), మేకా వెంకట ప్రతాప్ అప్పారావు (నూజివీడు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ, కొనుగోలు విషయంలో ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పూర్తి పారదర్శకంగా రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు ప్రవేశపెట్టిన నూతన విధానాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేసే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమన్నారు. ధాన్యం సేకరణకు సరిపడా గోనె సంచులు ప్రతి రైతుభరోసా కేంద్రానికి వచ్చే ధాన్యానికి అనుగుణంగా సిద్ధం చేసుకోవాలన్నారు. రొటేషన్ పద్ధతిలో వాటిని వినియోగించాలని సూచించారు. రైతుభరోసా కేంద్రాల పరిధిలో సొసైటీలకు నిర్దేశించిన ధాన్యం సేకరణ లక్ష్యం 90 శాతం చేరిన వెంటనే అదనపు లక్ష్యం అవసరం గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. గోనె సంచులు, లారీల రవాణాపై నిరంతర ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా ఎటువంటి లోపాలూ లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లారీల కిరాయికి సంబంధించి నిధులు అందుబాటులో ఉన్నాయని, వీటి చెల్లింపుల్లో ఎటువంటి జాప్యమూ ఉండబోదనిఅ న్నారు. రైస్‌మిల్లర్ల వద్ద ఉన్న లారీల వివరాలను కూడా సేకరించి రవాణాకు వినియోగించాలన్నారు. రైతుభరోసా కేంద్రాల వద్ద కొలిచిన ధాన్యం తేమ శాతమే తుది నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. ధాన్యం విక్రయించుకోవడంలో రైతులకు ఏమైనా సమస్యలు ఎదురైతే కంట్రోల్ రూమ్ నెంబరు 1800 425 6453కు తెలియజేయాలని కోరారు. ఫిర్యాదు అందిన 12 గంటల్లోపే ఆయా ప్రాంతాలకు బృందాలను పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్వాకు విద్యుత్ రాయితీకి సంబంధించి సర్వే పూర్తి చేశారన్నారు. అయితే సంబంధిత ఆక్వా రంగ ప్రాంతంలో ఆక్వాజోన్-నాన్‌ఆక్వాజోన్ నిర్ధారణ చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ వరికోతలు ముమ్మరంగా సాగుతున్నందున ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను అందుబాటులో ఉంచడంతోపాటు రవాణా సౌకర్యానికి లారీలను ఏర్పాటు చేయాలన్నారు. ఆక్వాజోన్-నాన్‌ఆక్వాజోన్ నిర్ధారణకు సంబంధించి రైతుల్లో మరింత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ధాన్యం సేకరణకు సంబంధించి రోజువారీ వివరాలను అందించాలని సూచించారు. పామాయిల్ మొక్కలను రైతులకు సరఫరా చేయడంలో వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. మైక్రో ఇరిగేషన్‌పై మండలాలవారీ రైతుల రిజిస్ట్రేషన్, మంజూరు, యూనిట్ స్థాపన వివరాలను అందించాలని కోరారు. దీనిపై సంబంధిత శాఖ పీడీ రవికుమార్ మాట్లాడుతూ ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు సంబంధించి మంజూరు, స్థాపన కార్యక్రమం ప్రారంభమైనట్లు తెలిపారు. నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ హార్టికల్చర్ హబ్‌గా ఉన్న నూజివీడుకు ప్రత్యేకంగా ఉద్యాన శాఖాధికారిని అందుబాటులో ఉంచాలన్నారు. పామాయిల్, మామిడి సాగుపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా పురుగుమందుల స్ప్రేయర్లు సబ్సిడీపై మంజూరు, ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ, మైక్రోన్యూట్రియన్స్ సబ్సిడీ, ఆక్వా రైతులకు అవసరమైన ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు వైఎస్‌వి.సత్యనారాయణ, వైఆర్‌కెపిఆర్.బాబ్జి, వి.హరిబాబు, రవీంద్రరెడ్డి, వెంకటరామయ్య, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల జాయింట్ డైరెక్టర్లు వై.రామకృష్ణ, చంద్రశేఖర్, జి.నెహ్రూబాబు, ఇరిగేషన్ ఎస్ఇ కె.శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ పాండురంగారావు, ఎల్‌డిఎం ఎస్.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ రాంబాబు, ఎపిఎంఐపి పీడీ రవికుమార్, ట్రాన్స్‌కో ఇఇ ఎం.ఝాన్సీ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు మంజుభార్గవి, జిల్లా సహకార శాఖ అధికారి ప్రవీణ, డిఎస్‌ఒ ఆర్‌ఎస్‌ఎస్.రాజు, మత్స్యశాఖ ఎడి ఎన్.నర్సయ్య, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్, సెరీకల్చర్ డిడి వాణీ దిరిశాల పాల్గొన్నారు.

283 ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోళ్లు

త్వరలో మరో వంద కేంద్రాల్లో ప్రారంభం

జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు

సంచులు సరే.. లారీలేవీ

జెసి ఎదుట వాపోయిన ఉంగుటూరు రైతులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయం, రైతుభరోసా కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన సమీక్షించారు. ధాన్యం కొనుగోలులో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోనె సంచుల కొరత లేదని, ధాన్యం బస్తాల్లో నింపినా లారీలు లేకపోవడంతో రెండు, మూడు రోజుల నుంచి కల్లాల్లోనే ఉంటున్నాయని, సరిపడా లారీలను పంపాలని రైతులు కోరారు. శుక్రవారం సాయంత్రంకల్లా కల్లాల్లోని మొత్తం బస్తాలను మిల్లులకు తరలించేలా వాహనాలను ఏర్పాటు చేశామని, ఆందోళన చెందొద్దని రైతులకు జెసి వివరించారు. తేమశాతం, శాంపిళ్లు తీయడానికి, సంచులు ఇవ్వడానికి సరిపడా సిబ్బందిని ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ధాన్యం లారీల్లో ఎగుమతి చేశాక మోకు ఛార్జీగా లారీ యజమానులు రూ.వెయ్యి నుంచి రూ.1200 అడుగుతున్నారని రైతులు చెప్పగా అలా ఎవరైనా డిమాండు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను జెసి ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెసి మాట్లాడుతూ జిల్లాలో 3.84 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యంలో భాగంగా ప్రస్తుతానికి 8,192 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ఒక్క ఉంగుటూరులోనే 5600 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. జిల్లాకు ఖరీఫ్‌లో 90 లక్షల గోనె సంచులు కావాల్సి ఉండగా ఇంత వరకు 60 లక్షలు సేకరించి ఆర్‌బికె, సొసైటీల ద్వారా రైతులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన సంచులను రిజర్వ్‌గా ఉంచామన్నారు. ఒక్క ఉంగుటూరులోనే 40 వేల సంచులు పంపిణీ చేశామని చెప్పారు. ఎకరానికి 65 సంచులు ఇస్తున్నామని, అయితే దిగుబడులు ఎక్కువగా రావడంతో ఎకరానికి 70 నుంచి 80 సంచులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారని చెప్పారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. ఆయన వెంట తహశీల్దార్ ఎవి.రమణరావు ఉన్నారు.


రైతులతో మాట్లాడుతున్న జెసి అరుణ్‌బాబు

నేడు, రేపు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం

ప్రజాశక్తి - ఏలూరు

ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19, 20వ తేదీల్లో, డిసెంబర్ 3, 4 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజుల్లో బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. 2023 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన లేదా నిండుతున్న వారు డిసెంబరు 8వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

నగరంలో ఆక్రమణల తొలగింపు : కమిషనర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

హైకోర్టు ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల తొలగింపు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిషనర్ షాహిద్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ షాహిద్ మాట్లాడుతూ నగర పరిధిలోని ప్రభుత్వ, మున్సిపల్ స్థలాలు, శ్మశానాలు, చెరువుల ఆక్రమణలకు గురికాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

జెడ్‌పి పిఎఫ్ బ్యాలెన్స్ షీట్లు ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా పరిషత్తుల ద్వారా పిఎఫ్ కడుతున్న జిల్లాల్లోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పిఎఫ్ బ్యాలెన్స్ షీట్లు గతంలో ప్రతి ఆర్థిక సంవత్సరానికి జిల్లా పరిషత్ నుంచి పంపించేవారని, జెడిఎఫ్ కాలంలో నిలిపివేశారని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. నిలిపివేసిన జిల్లా పరిషత్ బ్యాలెన్స్ షీట్లు ఇప్పించాలని కోరుతూ జిల్లా పరిషత్ పిఎఫ్ విభాగం అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి.దుర్గాదేవికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్, ప్రధాన కార్యదర్శి పి.వి.నరసింహారావు, కోశాధికారి షేక్ ముస్తాక్ అలీ, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రాంభద్రం, కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బిబిఎస్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైద్య సేవలకు దాతల సాయం అభినందనీయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


ఇన్వర్టర్లను ప్రారంభిస్తున్న జెసి అరుణ్‌బాబు

మెరుగైన వైద్య సేవలు అందించడానికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మూడు విభాగాల ఇన్వర్టర్లను జెసి అరుణ్ బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎల్ ఏరియా ఆసుపత్రిని సందర్శించినప్పుడు సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు వైద్య సేవలకు ఇబ్బంది కలుగుతుందని తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఈ నేపథ్యంలో స్థానిక తహశీల్దార్‌కు ఈ సమస్యను పరిష్కరించడానికి దాతలను సంప్రదించాలని సూచించామన్నారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ స్లీవజోజ్ వ్యక్తిగతంగా రూ.50 వేలు, మరోదాత ఎన్.వెంకటపతిరాజు రూ.50 వేలు అందించారని తెలిపారు. దాతల సాయంతో ఎమర్జెన్సీ ఓపి, నేత్ర విభాగం, ప్రసూతి విభాగాల్లో ఇన్వర్టర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్లీవజోజ్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల, దాత ఎన్.వెంకటపతిరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

రేచర్ల ఎంపియుపి పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ మణికుమారి తెలిపారు. ఆధార్ సేవా కేంద్రాన్ని గ్రామ సర్పంచి శ్రీరామకృష్ణతో కలిసి ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఆధార్‌కార్డు అప్‌డేట్, మార్పులు, చేర్పులు చేసుకునేందుకు, కొత్తగా ఆధార్ కార్డు నమోదు చేసుకునేవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

జీలుగుమిల్లి :ఆధార్ కార్డు అప్‌డేట్, మార్పులు, చేర్పులు చేసుకునేందుకు మండలంలోని తాటియాకులగూడెం, అంకన్నగూడెం సచివాలయాల పరిధిలో శనివారం ఆధార్ కేంద్రాలను నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.మంగతాయారు తెలిపారు. కొత్త ఆధార్ కార్డు నమోదు చేసుకునేవారు, ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, సవరణలు చేయించుకునేవారు, ఇంటి చిరునామా, మొబైల్ నెంబరు, ఫొటో మార్పుకోవాల్సిన వారు, బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాల్సిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

ఉచిత బియ్యాన్ని సక్రమంగా అందించండి

ప్రజాశక్తి - ఉంగుటూరు

వచ్చే నెలలో ప్రధాన మంత్రి ఉచిత బియ్యాన్ని లబ్ధిదారులందరికీ సక్రమంగా సరఫరా చేయాలని ఉంగుటూరు తహశీల్దార్ ఎవి.రమణారావు కోరారు. శుక్రవారం నిర్వహించిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన పలు సూచనలు ఇచ్చారు. రేషన్ సరుకుల కోటా సకాలంలో తీయాలన్నారు. సివిల్ సప్లై డిటి శేఖర్‌బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వేల్పుచర్ల విద్యార్థులు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని వేల్పుచర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చల్లిమంద శ్రీపూజ, గోరింక జోష్ రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎలిఎమ్‌ఎస్.నాగేంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

జిల్లా స్థాయి పోటీలకు..

నిడమర్రు : మండలంలోని అడవికొలను జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు రమ్య, కౌశిక్, సత్య మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి పరీక్షలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వారు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు పసుమర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నేరాలు - ఘోరాలు

ఆసుపత్రిలో బాలింత మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన ఆ తల్లిని బిడ్డతో ముద్దు ముచ్చట తీరకముందే మృత్యువు కబళించింది. దీంతో ఆ కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది. బాలింత మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం... చాగల్లుకు చెందిన జాలిమి దుర్గా ప్రసాద్‌కు జంగారెడ్డిగూడెం మండలం జాన్నవారిగూడేనికి చెందిన గీత ప్రియాంక(29)కు సుమారు ఏడాది క్రితం వివాహమైంది. గీత ప్రియాంక గర్భం దాల్చడంతో పుట్టింటి వద్ద ఉంటూ జంగారెడ్డిగూడెం లక్ష్మి ఆసుపత్రిలో వైద్యం పొందుతుంది. ఈ క్రమంలో పుట్టింటి వద్ద నుంచి గీతా ప్రియాంకను జంగారెడ్డిగూడెం లక్ష్మి ఆసుపత్రికి ప్రసవం కోసం ఈ నెల 18వ తేదీన తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు ఆపరేషన్ చేయడంతో గీత ప్రియాంక మగ బిడ్డకు జన్మనిచ్చింది. 19వ తేదీ శుక్రవారం మధ్యాహ్న సమయంలో గీతా ప్రియాంక అస్వస్థతకు గురైనట్టు బంధువులు చెప్పారు. అధిక రక్తస్రావం అవడం వల్ల గీతా ప్రియాంకకు రక్తం ఎక్కించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. వైద్యం అందిస్తున్న సమయంలో గీత ప్రియాంక తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందిందని బంధువులు తెలిపారు.

ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

బాలింత గీతా ప్రియాంక మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆమె అత్తగారు లక్ష్మి బహిరంగ ఆరోపణ చేశారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో బాధితులకు అండగా నిలిచిన ప్రజాసంఘాలు ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. గీతా ప్రియాంక కుటుంబానికి న్యాయం చేయాలని నిర్లక్ష్యం వహించిన ఆసుపత్రి వైద్యులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు.

లారీ ఢీకొని ఎఎన్ఎంకు గాయాలు

కొయ్యలగూడెం : స్కూటీని లారీ వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో ఎఎన్ఎం తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోడిగూడెం గ్రామంలో సచివాలయం ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న పి.దుర్గాప్రశాంతి శుక్రవారం అంకాలగూడెం నుంచి బోడిగూడెం స్కూటీపై వెళ్తుంది. ఈ క్రమంలో మార్గమధ్యలో ఆమె స్కూటీని వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దుర్గాప్రశాంతి రెండు కాళ్లు నుజ్జునుజ్జుఅయ్యాయి. స్థానికులు ఆమెను ఆటోలో కొయ్యలగూడెంలో ఓ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కొయ్యలగూడెం : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ టి.శ్రీనివాసరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, అశ్వారావుపేట నుంచి కాకినాడ పోర్టునకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు కొయ్యలగూడెం ప్రధాన సెంటర్లో పోలీసు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో 20 క్వింటాళ్ల బియ్యం, గూడ్స్ ట్రక్ స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

బాలల హక్కుల అమలుతోనే అభివృద్ధి

జెసి అరుణ్‌బాబు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం


మాట్లాడుతున్న జెసి అరుణ్‌బాబు

బాలల హక్కుల అమలు ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ఇన్‌ఛార్జి ప్రాజెక్టు ఆఫీసర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. ఐటిడిఎ సమావేశపు హాలులో బాలల హక్కులు అమలుతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన అంశంపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సచివాలయాల శాఖ సామాజిక పరివర్తన మార్పు సమాచార విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ జిల్లాల్లో రక్తహీనత రూపుమాపాలని పిలుపునిచ్చారు. గర్భిణులు, బాలింతలు, యుక్త వయసు బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. బాలల హక్కులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అవినాభావ సంబంధం ఉన్న దృష్ట్యా వాటి అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. వీటి అమల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గౌరవ అతిథిగా హాజరైన జిల్లా బాలల సంక్షేమ సమితి ఛైర్మన్ బి.రిబ్కారాణి మాట్లాడుతూ బెంచ్ ఆఫ్ మేజిస్ట్రేట్స్ హోదాలో రక్షణ సంరక్షణ అవసరమైన బాలల కోసం పని చేస్తున్నట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం డివిజనల్ అభివృద్ధి అధికారి ఎం.రాజు మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది అంకితభావంతో పని చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా సచివాలయాల శాఖ సామాజిక పరివర్తన మార్పు సమాచార విభాగం అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బుట్టాయగూడెం ఐసిడిఎస్ సిడిపిఒ, సూపర్ వైజర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో ప్రతిభకు గుర్తింపు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం


పోటీ పరీక్షలతో విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు దక్కుతుందని మండల విద్యాధికారి జె.సురేష్‌బాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సైన్సు సంబరాలు-2022లో భాగంగా చెకుముకి మండలస్థాయి ప్రతిభ పరీక్ష శుక్రవారం నిర్వహించారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపిపి గంజిమల రామారావు అన్నారు. మండలంలోని రాజవరంలో పంచాయతీ పరిధిలో సర్పంచి ఏలేటి చిన్న తుక్కయ్య ఆధ్వర్యంలో పూలరతమ్మ ఆలయం వద్ద నిర్మిస్తున్న జగనన్న కాలనీలో బోరు నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు.

వారం రోజుల్లో వినియోగంలోకి బెయిలీ వంతెన


వంతెన పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

భీమడోలు :ఏలూరు కాలువపై గుండుగొలను వద్ద అమర్చిన బెయిలీ వంతెన సేవలను వారం రోజుల్లోగా పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామని ఎంఎల్ఎ వాసుబాబు తెలిపారు. కాలువపై రూ.46 లక్షల వ్యయంతో బెయిలీ వం తెన అమర్చే పనులు పూర్తయిన నేపథ్యంలో పనుల ప్రగతిని ఎంఎల్ఎ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనుగొండ వద్ద తొలగించిన బెయిలీ వంతెన సామగ్రిని పెనుగొండ నుంచి గుండుగొలను తెచ్చి అక్కడ బెయిలీ వంతెన అమర్చేందుకు ఆంధ్రప్రదేశ్ రోడ్ల అభివృద్ధి కమిషన్ ఛైర్మన్ కె.సుబ్బరాజు, గ్రామ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణ రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు సహకారాలు అందించారని తెలి పారు. గుండుగొలను వద్ద వంతెన కూలిన నేపథ్యంలో వచ్చే వేసవిలో వంతెన నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన అను మతులు, నిధుల మంజూరుకు ముఖ్యమం త్రిని కలవ నున్నా మన్నారు. విద్యుదీకరణ పనులు చేపట్టాలని గ్రామ పంచాయతీని ఆదేశించినట్లు చెప్పారు. బెయిలీ వంతెనకు కొంతదూరంలో ప్రమాదాలకు తావు లేకుండా డివైడర్ తొల గింపు, రెండు వైపులా మార్గం ఏర్పాటు విషయమే జాతీ య రహదారుల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడ తానన్నారు. వీటితో పాటు హెచ్చరిక బోర్డులు, వేగనిరోధకాల ఏర్పాటు విషయమై సదరు శాఖ అధికారులతో మాట్లా డతానన్నారు. వీటన్నింటిని నాలుగు రోజుల లోగా పూర్తిచేసి ట్రయల్ రన్ నిర్వహిస్తామన్నారు. పూర్తిస్థాయిలో వారం రోజుల్లో వాహ నాలు ఇబ్బంది లేకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉత్సాహంగా గురుకుల పాఠశాలల వన సమారాధన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


వనసమారాధనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మండలంలోని బర్రింకలపాడు ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల ఆధ్వర్యంలో శుక్రవారం వన సమారాధన కార్యక్రమాన్ని ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థుల ఆట పాటలతో కేరింతలతో పరిసర ప్రాంతం ఆద్యంతం ఆహ్లాద వాతావరణం నెలకొంది. వసతి గృహం ప్రిన్సిపల్ బుడితి పెద్దిరాజు, ఉపాధ్యాయ సిబ్బంది అందరూ స్వచ్ఛందంగా పాల్గొని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పెద్దిరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో క్రమశిక్షణ అలవాటు చేసుకున్నప్పుడే ఉన్నత స్థితికి చేరుకుంటారని, అందుకు తాను తమ సిబ్బంది నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని తెలిపారు. ప్రతి సంవత్సరం వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు పాఠశాలల యాజమాన్యం, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

మధ్యాహ్న భోజనాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

ఆహార భద్రత పథకంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం సేవలను వినియోగించుకోవాలని వైఎస్ఆర్ ఉద్యానవన విశ్వ విద్యాలయం, వెంకట్రామన్నగూడెం డైరెక్టర్ ఇ.కృపాశ్రీ కోరారు. డైరెక్టర్‌తో పాటు విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ బి.దీప్తి పోలసానిపల్లిలోని ఎంపిపి ప్రాథమిక పాఠశాల-1ని శుక్రవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం చిరుధాన్యాలతో తయారుచేసిన బిస్కెట్లు, రాగి ఉండలు విద్యార్థులకు అందించారు. 15 రకాల చిరు ధాన్యాలు, ఆకుకూరల విత్తనాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికాంత్‌కు అందించారు.

ఆగిరిపల్లిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచి లక్ష్మీ విక్టర్‌బాబు

ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకోవాలని, తద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా నివారించవచ్చని ఆగిరిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచి చవటపల్లి లక్ష్మీవిక్టర్‌బాబు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆగిరిపల్లిలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలుచోట్ల పారిశుధ్య పనులను పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించగా గ్రామ సర్పంచి లక్ష్మీవిక్టర్‌బాబు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, వార్డు సభ్యులు, వాలంటీర్లు, ఎంపిటిసి సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

జ్వరాలపై ఇంటింటా సర్వే

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

అంటువ్యాధుల నిర్మూలనలో సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తే డెంగీ, మలేరియా వంటి జ్వరాలను కొంతవరకు అరికట్టవచ్చని దీనిలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరమని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. ఏలూరు రూరల్ నాగేంద్ర కాలనీ మారుతినగర్‌లో శుక్రవారం ఇంటింటా జ్వరాల సర్వే నిర్వహించారు. అన ంతరం మురికి కాలువలో అబేట్ ద్రావణం పిచికారీ చేయించారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

సహకార రంగం సాయంతో వ్యాపారాలు అభివృద్ధి

ప్రజాశక్తి - గణపవరం


జెండా ఎగరవేస్తున్న ఛైర్‌పర్సన్ అశోక చక్రవర్తి

సహకార రంగంలో వచ్చిన మార్పులతో వ్యాపార అవకాశాలు వినియోగించుకుని సభ్యులకు, ప్రజలకు సేవలందించాలని ఆడిట్ జిల్లా అధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. సొసైటీ 69వ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మొయ్యరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. వారోత్సవాలను సంఘ ఛైర్మన్ ఈదర అశోక్ చక్రవర్తి త్రివర్ణ పతాకం ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు రుణాలు అందించడంలో సొసైటీ ముందుందన్నారు. సొసైటీ సిఇఒ ఎండి శ్రీనివాసరావు మాట్లాడుతూ సొసైటీ ద్వారా స్వల్పకాలిక రుణాలు రూ.6.45 కోట్ల దీర్ఘకాలిక రుణాలు రూ.53 లక్షల బంగారు నగలపై రూ.40 లక్షలు ప్రజలకు, రైతులకు రుణాలందించామని చెప్పారు. రైతులకు, ప్రజలకు సొసైటీ సిబ్బంది అందుబాటులో ఉండి సొసైటీని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వారోత్సవాల ఇన్‌ఛార్జి ఆర్.శ్రీనివాసరావు, ఆడిట్ సూపరింటెండెంట్ పర్సన్ గంటా పద్మజ, సత్తి అప్పారెడ్డి, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటుకు ఆధార్ అనుసంధానం

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు నియోజకవర్గంలోని ఓటు హక్కు కలిగి ఉన్న వారందరూ తప్పనిసరిగా ఓటు కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని దెందులూరు తహశీల్దార్ ఎన్‌వి.నాంచారయ్య తెలిపారు. అందుకోసం ఆయా మండలాల్లోని ప్రతి పోలింగ్ కేంద్రాల వద్ద శనివారం, ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వ్యవసాయ క్షేత్రాల సందర్శన

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి కంకిలో 90 శాతం గింజలు పక్వానికి వచ్చిన తర్వాత మాత్రమే పంట కోత కొయ్యాలని చింతలపూడి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సహాయకులు నాగకుమార్ తెలిపారు. మండలంలోని రాఘవపురం గ్రామంలో ఖరీఫ్ 2022 సిజన్ పొలంబడి నిర్వహిస్తున్న క్షేత్రాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచుపడే సమయంలో కోత కోస్తే గింజలు ఎక్కువగా కిందరాలే ప్రమాదం ఉందన్నారు. నాణ్యత తగ్గుతుందని తెలిపారు.

పిహెచ్‌సిలో మెరుగైన వైద్యసేవలందించాలి

మండవల్లి సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలు



మండవల్లి సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

ప్రజాశక్తి - మండవల్లి

వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు కోరారు. స్థానిక డ్వాక్రా సంఘాల కార్యాలయంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గప్రసాద్(రాము) అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మొదటి అజెండాగా వైద్యం పైనే సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు మాట్లాడుతూ మండవల్లి పిహెచ్‌సిలో రోగులకు వైద్య సేవలందడంలేదని, ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండడం లేదని, రోగులు ప్రయివేట్ వైద్యశాలలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని ఎంపిపి దృష్టికి తీసుకొచ్చారు. ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాల ఏర్పాటులో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రోగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీంతో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.మల్లేశ్వరి వైద్యులకు సమాచారం అందించినప్పటికీ సర్వసభ్య సమావేశానికి సూపర్‌వైజర్ హాజరు కావడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యురాలి నిర్లక్ష్య ధోరణిపై చర్యలు తీసుకునేలా జిల్లా వైద్య అధికారులకు, కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని ఆమె తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

చాట్రాయి : అధికారులందరూ చిత్తశుద్ధితో పని చేయాలని రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి సూచించారు. చాట్రాయి మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి లంక నిర్మల అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాఘవరెడ్డి మాట్లాడుతూ మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశానికి ప్రభుత్వ అధికారులందరూ హాజరు కాకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క ఉద్యోగి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అనంతరం రాఘవరెడ్డిని మండలంలోని పాత్రికేయులు ఘనంగా సత్కరించారు.

చిరస్మరణీయులు డాగ్యురే

ప్రజాశక్తి - భీమడోలు

పాత జ్ఞాపకాలను చిత్రాల రూపంలో భద్రపరిచే ప్రక్రియలో కీలక పాత్ర పోషించే కెమెరా సృష్టికర్త డాగ్యురే చిరస్మరణీయులని భీమడోలు ఏరియా ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు పిల్లి బ్రహ్మారావు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో భీమడోలులో అబ్దుల్ కలాం-డాగ్యురే వేదిక వద్ద డాగ్యురే 208వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు డాగ్యురే విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు.

జగనన్న హెల్త్ క్లినిక్‌లు ఉపయోగకరం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న హెల్త్ క్లినిక్‌లు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని సర్పంచి ముప్పిడి విజయకుమారి అన్నారు. స్థానిక పరింపూడి రామాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య శిబిరం కార్యక్రమం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ప్రభుత్వ డాక్టర్లు ఎస్తేరురాణి ఉమాశంకర్లు అందించారు.

షష్టి ఉత్సవాలు విజయవంతం చేయాలి : ఆర్‌డిఒ

ముదినేపల్లి :జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం శ్రీసుబ్రహ్మణ్యేశ్వర షష్టి కళ్యాణ మహోత్సవాలు విజయవంతం చేయాలని ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్ కోరారు. మండలంలోని సింగరాయపాలెంలో ఈ నెల 28 నుంచి డిశంబర్ పదో తేదీ వరకు నిర్వహించనున్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వర షష్టి కళ్యాణ మహోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - దెందులూరు

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా దెందులూరు మండలంలోని పోతునూరు శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం రూపావత్ రంగయ్య, ఎస్.నాగరాజు పాల్గొని క్విజ్ పోటీలను పర్యవేక్షించారు. విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా తమ మేధాశక్తిని పెంపొందించుకుంటారని తెలిపారు. గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్‌బాబు పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలు గ్రంథాలయంలో గ్రంథపాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి స్వచ్ఛంద సంస్థ మానవతా జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు హాజరయ్యారు. వ్యాసరచన పోటీ, చదరంగం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు టివి.ఉమామహేశ్వరరావు పర్యవేక్షించారు. పూళ్ల శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకులు డిఎన్‌బి.అమర్‌నాథ్ ఆధ్వర్యంలో దిశా చట్టంపై అవగాహన సదస్సు, వ్యాసరచన పోటీ నిర్వహించారు.

కొయ్యలగూడెం: స్థానిక గ్రంథాలయం వద్ద విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతగా చదరంగం నిపుణులు ఎస్‌బిజి.శేకర్ వ్యవహరించారు. గ్రంథాలయ అధికారి యు.రాముడు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించామని గ్రంథాలయ అధికారి పి.దుర్గారావు తెలిపారు.

చాట్రాయి : చాట్రాయి గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా హైస్కూల్ హెచ్‌ఎం జి.సత్యనారాయణ రెడ్డి, సోషల్ ఉపాధ్యాయులు భద్రయ్య వ్యవహరించారు.

మండవల్లి : ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు విద్యార్థులు విద్యార్థి దశ నుంచే కృషి చేయాలని ప్రొఫెసర్ సుధా బత్తుల విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8,10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.